క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు వైద్యం



ఎగువ తవణంపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని మత్యం, ఎగువ తవణంపల్లె సచివాలయాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ సేవలందించారు. వైద్యాధికారులు 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

తృణమూల్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసేలా భారత రాష్ట్రపతి చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మక ధర్నాలకు కారకులైన టీఎంసీ నేత షాజహాన్ షేక్‌కు వ్యతిరేకంగా శుక్రవారం చిత్తూరులోని గాంధీ విగ్రహ కూడలి వద్ద నిరసన తెలిపారు. నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నాయకులు వెంకటముని, షణ్ముగం, శ్రీధర్, హరినాథ్, మోహన్, రవికుమార్, రామభద్ర, సురేష్, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి

పూతలపట్టు: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడి పొందవచ్చని తిరుపతి జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు గంగాధరం తెలిపారు. మండలంలోని పి.కొత్తకోట రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి రసాయన మందులు ఉపయోగించడంతో భూమి, పంట దెబ్బతిని ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఒక దేశీయ ఆవు నుంచి లభించే పేడ, పంచితం ద్వారా బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, పంచకార్యము తయారు చేస్తారని తెలిపారు. ఇది సహజ పద్ధతి అని, ప్రతి రైతు తనకున్న పొలంలో సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తెలి పా రు. సర్పంచ్ పద్మజరాణి, పంచాయతీ కార్యదర్శి జరీనాతాజ్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం



పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

ఐరాల: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాతపాళ్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో వైద్య నిపుణులు 217 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 76 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలు, హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషలిస్టు డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, శారద, శిరీష పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

రొంపిచెర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని చిత్తూరు జెడ్పీ సీఈఓ గ్లోరీ ఆదేశించారు. శుక్రవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల లిస్టులో మార్పులు–చేర్పులు, తొలగింపులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, బీఎల్‌ఓలు తప్పిదాలకు తావులేకుండా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. జాబితాలో ఎలాంటి తప్పులు గుర్తించినా దానికి బీఎల్‌ఓలే బాధ్యత వహించాల్సి వస్తుందని, వారిపై చర్యలు కూడా తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఒకచోట మాత్రమే ఓటు ఉండాలని, ఎక్కువ చోట్ల ఉన్న పక్షంలో ఒకచోట ఉంచి మిగిలిన చోట్ల తొలగించాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో కరెంటు, తాగునీరు, మరుగుదొడ్లు.. ఇత్యాది సౌకర్యాలను కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ షేక్ మోహీద్దీన్, ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి, డీటీలు లోకేష్, రమణారెడ్డి, ఏఎస్‌ఓ రాజేశ్వరి, ఆర్‌ఐ అబ్దుల్ ఖాదర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



ఓటర్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ గ్లోరీ

జన సంక్షేమమే జగనన్న అజెండా

- వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చిత్తూరు: ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే జగనన్న అజెండా అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. స్థానిక జాన్స్‌గార్డెన్ డివిజన్‌లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసిన జగనన్న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని చెప్పారు. ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి అంటూ పాలన సాగిస్తున్నారని గుర్తుచేశారు. అధికారమే లక్ష్యంగా ప్రతిపక్షాలు అధికార పక్షంపై బురదచల్లడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. వారికి మద్దతుగా ఎల్లో మీడియా దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నదన్నారు. ప్రతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ హయాంలో జరుగుతున్న సంక్షేమం వారికి కనిపించడం లేదన్నారు. కేవలం చంద్రబాబును అధికారంలో తీసుకురావడానికి తప్పుడు వార్తలు రాయడం అజెండాగా పెట్టుకున్నారని చెప్పారు. డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్‌సీపీని ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని స్థానికులను అభ్యర్థించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, కార్పొరేటర్ చల్లాముత్తు నాయకులు జాయ్‌జోసఫ్, శేఖర్, జయకుమార్, దినకరన్, దావూద్, షరీఫ్, రాజేష్, జయచంద్ర, సుధ, కుప్పరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును విజయానందరెడ్డి అందజేశారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం నగరంలోని మిట్టూరుకు చెందిన మంజు కాలుకు చికిత్స తీసుకోగా ఆయనకు రూ.65వేలు, గుడిపాల మండలం పానాటూరు ప్రాంతానికి చెందిన నాగరత్నమ్మ గుండె సమస్యతో బాధపడుతుండగా ఆమెకు రూ.50 వేల చెక్కును విజయానందరెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందాం

చిత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది, తనది ఎన్నికలొస్తే మెప్పించే నాయకత్వం కాదని, నిత్యం అందుబాటులో ఉంటూ నాయకులకు అండగా నిలబడతామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలో శుక్రవారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో చిత్తూరు రూరల్ మండల నాయకుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎవరూ అమలు చేయలేనన్ని పథకాలను సీఎం జగన్ ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. మళ్లీ రెండో సారి జగనన్నను సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నాయకులు, కార్యకర్తలు మనస్పర్థలు వదిలి మండలంలో వైఎస్సార్‌సీపీని బలపరచాలని చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం టీడీపీ నాయకులు మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే ఈ సారి మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులందరూ సమష్టిగా పనిచేసి జగనన్నను గెలిపించుకుందామన్నారు. ఎంఎస్ బాబు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఇచ్చే తప్పుడు హామీలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అమరనాథ్‌రెడ్డి, త్యాగరాజులు, భాస్కర్, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, నాయకులు వేలుస్వామి, జయపాల్, కుమార్, రాబర్ట్, వెంకటేష్, రాజా, కన్నన్, రాజేంద్ర, ఎంజీఆర్, బాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



గుడిపాల: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బంగారుపాళెం: మండలంలో జూనియర్ ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు డిపార్ట్‌మెంటల్ అధికారి రవళి తెలిపారు. స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 371 మంది విద్యార్థులకు గాను 356 మంది హాజరైనట్లు తెలిపారు. 15 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. పరీక్ష కేంద్రం వద్ద సీఐ నాగరాజరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గట్టి బందోబస్తు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షలకు 234 మంది హాజరయ్యారు. సీఐ రవిశంకర్‌రెడ్డి పరీక్ష కేంద్రాల ఆవరణలో గట్టి బందోబస్తును నిర్వహించారు.

సజావుగా నిర్వహించండి

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్షను పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్ పరిశీలించారు. మొదటి రోజు పరీక్షకు 114 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా, సజావుగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



బంగారుపాళెం: విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్న అధికారులు

ప్రారంభోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆలయ ఈఓ వెంకటేశు

కాణిపాకం: స్వామివారి దేవస్థానం పరిధిలో ఈ నెల 4న సోమవారం మంత్రులు ప్రారంభించనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఈఓ వెంకటేశు ఆలయ అధికారులను ఆదేశించారు. ఈవో సమావేశపు మందిరంలో ఆలయ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఆలయంలో నిర్వహించనున్న ప్రారంభోత్సవాలకు డిప్యూటీ సీఎంలు నారాయణ స్వామి, కొట్టు సత్యనారాయణ, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎంపీ రెడ్డెప్పతో పాటు జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారని చెప్పారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ రోజు నుంచి ఏర్పాట్లు ప్రారంభించాలని, ఆదివారం సాయంత్రం కల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వాణి, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు విద్యాసాగర్ రెడ్డి, రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనుంజయ, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇంజనీరింగ్‌శాఖ ఏఈలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి నివాళి



సర్దార్ (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాళ్ల సర్దార్ (62) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామానికి చెందిన సర్దార్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని పూతలపట్టు ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా తోపాటు మండల నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు.

శుద్ధ జలం అందించడమే లక్ష్యం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సమన్వయకర్త సునీల్‌కుమార్, దాతలు

ఐరాల: గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధ జలం అందించడమే లక్ష్యమని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, దాతలు పై మాఘం సుగుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెంగనపల్లెలో దాతల సహాయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా కష్టాల్లోన్ని నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని చెంగనపల్లెలో శుక్రవారం మట్టపల్లెకు చెందిన దిలీప్‌కుమార్‌కు రూ.1.40 లక్షలు, పాలకలకు చెందిన వెంకటరత్నంకు రూ.1.10 లక్షలు, పుత్రమద్దికి చెందిన వనజాక్షికి రూ.90 వేలు విలువైన సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను ఆయన అందజేశారు. గతంలో అనారోగ్యానికి గురైన ముగ్గురు పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నారని, వారు నిరుపేదలు కావడంతో ఆర్థికసాయానికి సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పుడు నిధులు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి

తవణంపల్లె: పోలియో రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. జాతీయ పల్స్‌పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని, శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు

ఐరాల: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో కాణిపాకం ఇండియన్ బ్యాంకు శాఖ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు జిల్లా లీడ్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆర్థికపరమైన లావాదేవీలు, డిజిటల్ చెల్లింపులు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తొలుతగా ప్రతి విద్యార్థికి పైఅంశాలపై మూడు రకాల పుస్తకాలు, చొక్కాలు, క్యాప్‌లు, పెన్నులు ఆయన అందించారు. విద్యార్థులతో కలిసి కాణిపాకం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కాణిపాకం బ్రాంచ్ మేనేజర్ సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పొదుపు లక్షణాలు అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలను తెరచుకొని భవిష్యత్ కోసం పొదుపు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దీనిపై పాఠశాల విద్యార్థులకు పరీక్ష పోటీలు నిర్వహించారు. పరీక్షల్లో విజేతలైన ఇద్దరు విద్యార్థులకు ప్రథమ బహుమతి కింద రూ.4 వేలు చొప్పున, ద్వితీయ బహుమతి కింద ఇద్దరు విద్యార్థులకు రూ.3 వేలు చొప్పున, తృతీయ బహుమతికి ఎంపిక చేసిన ఇద్దరు విద్యార్థులకు రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో సోమశేఖర్‌నాయుడు, సురేష్‌బాబు, సురేంద్రబాబు, సతీష్, హషీమ్, బాలయ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ

గుడిపాల: ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండలంలోని పాపసముద్రం రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రబీలో సాగు చేసిన రైతులు, పంటల వివరాలన్నింటినీ వారికి చదివి వినిపించారు. వీటిలో మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే మార్చి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం తుది జాబితాను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ పంట నమోదు ఆధారంగానే రైతులకు వైఎస్సార్ ఉచిత పంటలబీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాలు వర్తిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లియమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ తులసీరాంరెడ్డి పాల్గొన్నారు.

పేదల బాగు కోసం జగనే రావాలి

- పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు
- వైఎస్సార్‌సీపీ పూతలపట్టు ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్



ఎగువ ఎద్దులవారిపల్లెలో ప్రచారం చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: పేదలు బాగుపడాలంటే మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని కాటప్పగారిపల్లె పంచాయతీ పరిధిలోని ఎగువ ఎద్దులవారిపల్లె, దిగువ ఎద్దులవారిపల్లె, దళితవాడ గ్రామాల్లో శుక్రవారం నాయకులతో కలసి డాక్టర్ సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని సాగించారు. ఇంటింటికీ వెళ్లి నవరత్నాల కరపత్రాలను అందజేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరో మారు ఆదరించాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రజల్లోకి నేరుగా వెళ్లే సత్తా వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని వెల్లడించారు. దేశానికి ఆదర్శంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడంతోపాటు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. ప్రతిపక్షాలు జగనన్న పాలనపై దుష్ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని కోరారు.

జగనన్నతోనే సంక్షేమం

జగనన్నతోనే బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు చేకూరుతాయని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత పార్టీలకు, రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. పేదపిల్లల చదువుల కోసం అమ్మ ఒడి, రైతులకు ఉచిత వ్యవసాయ బోర్లు, పంటల సాగుకు ఆర్థిక సాయం, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, శ్రామికులకు, చేతి వృత్తులవారికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. కరోనా కష్టకాలంలో ఆర్థిక సంక్షోభం నెలకొన్నా జగనన్న రాష్ట్రాన్ని ముందుకు తీసుకు తీసుకువెళ్లారని గుర్తుచేశారు. జగనన్న ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.

ప్రజలకు బాబు చేసిన మేలు ఏమిటి?

చంద్రబాబు పాలనలో ప్రజలకు జరిగిన మేలు ఏమిటని సునీల్‌కుమార్ ప్రశ్నించారు. బాబు పాలనలో ప్రభుత్వ పథకాలు పసుపు చొక్కా నేతలకు, జన్మభూమి కమిటీ సిఫార్సు చేసిన వారికి మాత్రమే లబ్ధి చేకూరినట్లు తెలిపారు. చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 600 హామీలలో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేసిన పాపానపోలేదని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలకు మాయమాటలు చెప్పి మోసగించాలని వస్తున్నారని విమర్శించారు. ప్రజలకు మేలు జరిగి ఉంటేనే తనకు ఓటు వేయండంటూ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుతున్నారనీ, అలా ప్రజల ముందుకు వెళ్లి చేసిన మేలు చెప్పుకుని ఓటు అడిగే దమ్ము, ధైర్యం చంద్రబాబుకు ఉందా? అని ప్రశ్నించారు. ప్రజలు బాబు మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, స్థానిక సర్పంచ్ అనసూయ, ఎంపీటీసీ హరి, పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రఘుపతిరాజు, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్ కుమార్‌రెడ్డి, యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజ, మండల యూత్ అధ్యక్షుడు జగదీష్, బీసీ నాయకులు కరుణాకర్, సాంబయ్య, కమలాపతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 21 మందికి ఉద్యోగాలు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న 21 మంది విద్యార్థులు జాబ్‌మేళాకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ తెలిపారు. ఆ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటీవల తమ కళాశాలలో అమెజాన్ సంస్థ జాబ్‌మేళా నిర్వహించినట్లు చెప్పారు. ఆ సంస్థ నిర్వహించిన మౌఖిక పరీక్షలో 21 మంది డిగ్రీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.2.08 లక్షలు జీతం వస్తుందని తెలిపారు. అనంతరం ఆ విద్యార్థులను ఆ కళాశాల ప్లేస్‌మెంట్స్ కో ఆర్డినేటర్ షమ్సుఅక్తర్, జేకేసీ కో ఆర్డినేటర్ తిరుకుమరన్, అధ్యాపకులు సంధ్యారాణి, కస్తూరి తదితరులు నియామకపత్రాలు అందజేసి అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు

నూతన ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ






ఐరాల: రమేష్‌బాబు, యాదమరి: రామాంజనేయులు, కాణిపాకం: రామ్మోహన్, గుడిపాల: శ్రీనివాసరావు

ఐరాల: మండల పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన రమేష్‌బాబు ఎస్‌ఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా ఉన్న వెంకటేశ్వర్లు వెదురుకుప్పానికి బదిలీ అయ్యారు. ఈయన వెదురుకుప్పం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

యాదమరి ఎస్‌ఐగా రామాంజనేయులు

యాదమరి: మండలానికి కొత్త ఎస్‌ఐగా రామాంజనేయులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా ఉన్న మునస్వామి సీఐగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. ఆయన స్థానంలో జీడీ నెల్లూరు నుంచి రామాంజనేయులు బదిలీపై వచ్చారు. ఉదయం పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, శాంతి భద్రతల పరిరక్షణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కాణిపాకం ఎస్‌ఐగా రామ్మోహన్

కాణిపాకం ఎస్‌ఐగా రామ్మోహన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాణిపాకంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస రావు గుడిపాలకు, అక్కడ ఉన్న ఎస్‌ఐ రామ్మోహన్ కాణిపాకానికి బదిలీ అయ్యారు.

గుడిపాల: మండలానికి బదిలీపై కొత్త ఎస్‌ఐగా వచ్చిన శ్రీనివాసరావు పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం పనిచేస్తానన్నారు.